సాక్షి
ఖమ్మం
సోమవారం । 18 । డిసెంబర్ । 2023



కొత్త సర్కార్‌పైనే ఆశలు..

రాష్ట్రంలో తాజాగా కొలువుదీరిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆసరా పెన్షన్ పెంచుతుందని లబ్ధిదారులు ఆశలు పెట్టుకున్నారు. 8లో



ముమ్మరంగా 'ముక్కోటి' పనులు

భద్రాచలంలో ఈనెల 22, 23 తేదీల్లో జరిగే తెప్పోత్సవం, ఉత్తర ద్వార దర్శనం వేడుకలకు ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. 10లో

గరిష్టం / కనిష్టం
29° / 17°

వాతావరణం

జిల్లాలో సోమవారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. తెల్లవారుజామున మంచు, రాత్రికి చలి అధికంగా ఉంటాయి.

న్యూస్‌రీల్

నేడు మంత్రి పొంగులేటి పర్యటన



ఖమ్మంవన్‌టౌన్ : రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సోమవారం జిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం 7 గంటల నుంచి ఖమ్మంలోని తన క్యాంప్ కార్యాలయంలో ఉమ్మడి జిల్లా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలను కలుస్తారు. 9 నుంచి 11 గంటల వరకు కలెక్టరేట్‌లో జరిగే పాలేరు నియోజకవర్గ సమీక్ష సమావేశంలో పాల్గొంటారు. మధ్యాహ్నం 2 గంటల వరకు క్యాంప్ కార్యాలయంలో అందుబాటులో ఉంటారని కార్యాలయ ఇన్‌చార్జ్ దయాకర్ రెడ్డి తెలిపారు.

ఒడి, బడి, గుడితో సమాజాభివృద్ధి

అలహాబాద్ అగ్రికల్చర్ యూనివర్సిటీ చాన్స్‌లర్ డాక్టర్ జే ఏ ఓలివర్



మాట్లాడుతున్న చాన్స్‌లర్ డాక్టర్ ఓలివర్

ఖమ్మంగాంధీచౌక్: సమాజాభివృద్ధిలో ఒడి, బడి, గుడి ప్రముఖ పాత్ర పోషిస్తాయని అలహాబాద్ అగ్రికల్చర్ యూనివర్సిటీ చాన్స్‌లర్ డాక్టర్ జే ఏ ఓలివర్ అన్నారు. యంగ్ మెన్స్ క్రిస్టియన్స్ అసోసియన్(వైఎంసీఏ) ఆధ్వర్యంలో ఆదివారం ఖమ్మం గొరిల్లా పార్క్‌లో జరిగిన సెమీ క్రిస్మస్ వేడుకల్లో ఆయన మాట్లాడారు. తల్లి ఒడిలో, బడిలో గురువు, గుడిలో మత పెద్దల నుంచి తెలుసుకున్న అంశాలు సమాజానికి ఎంతగానో ఉపకరిస్తాయని తెలిపారు. ప్రతి ఒక్కరూ పిల్లలకు ఈ అంశాలు బోధపడేలా నేర్పించాలని సూచించారు. ముందుగా కేక్ కట్ చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. సంస్థ అధ్యక్షులు బీజీ క్లైమెంట్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో హైదరాబాద్ వైఎంసీఏ అధ్యక్షుడు జయకర్ డేనియేల్, డోర్నకల్ డయోసిసన్ ప్రతినిధి జి. ప్రభాకర్ రావు, పారుపల్లి చిరుకందు, షేక్ సాబీర్ పాషా, డాక్టర్ బుంగి బాబా రత్నాకర్, జెట్టి సుధాకర్, శిల్పా జాన్సన్, జోడాన్ తదితరులు పాల్గొన్నారు.

బాల్‌బ్యాడ్మింటన్ జిల్లా జట్టు ఎంపిక

ఖమ్మం స్పోర్ట్స్ : ఖమ్మం నగరంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో ఆదివారం జిల్లా స్థాయి సీనియర్ పురుషుల బ్యాడ్మింటన్ జట్టు ఎంపికలు నిర్వహించారు. ఈ ఎంపికలకు జిల్లా వ్యాప్తంగా 40 మంది క్రీడాకారులు హాజరయ్యారు. జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు ఈనెల 23 నుంచి 25 వరకు హైదరాబాద్ బాలానగర్‌లో జరిగే రాష్ట్రస్థాయి సీనియర్ బాల్ బ్యాడ్మింటన్ టోర్నీలో పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు. జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారుల్లో బి.గోపి, ఎస్.రమేష్, బి.ఉపేంద్ర, ఆర్.రాకేష్, ఎస్‌కే అస్లాం, ఆర్.మంజు, ఎ.పవన్‌కుమార్, బి.శ్రీకాంత్, పి.ప్రశాంత్, ఎస్.గోపి, ఎ. తిరుపతి, ఎస్. ఉపేంద్ర, బి.గోపాల్, ఎస్.విజయకల్లం ఉన్నారు. కార్యక్రమంలో జిల్లా బాల్‌బ్యాడ్మింటన్ సంఘం అధ్యక్షుడు వెజెళ్ల సురేష్, కార్యదర్శి బొంతు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

గండం గట్టెక్కేనా..?

- విభేదాలతో మున్సిపల్ పాలకవర్గాలు సతమతం
- గతంలో కొన్నిచోట్ల ఛైర్మన్లపై అవిశ్వాస తీర్మానాలు
- కొత్త చట్టంపై స్పష్టత లేక పక్కన పెట్టిన కలెక్టర్లు
- రాష్ట్రంలో కాంగ్రెస్ విజయంతో మళ్లీ పావులు..



సాక్షిప్రతినిధి, ఖమ్మం: ఉమ్మడి జిల్లాలోని పలు మున్సిపల్ పాలకవర్గాలపై అవిశ్వాసం కత్తి వేలాడుతోంది. పాలకవర్గాల్లో నెలకొన్న విభేదాలు, రాజకీయ కారణాలతో పదవీ కాలం పూర్తి కావడం సందేహంగానే కనిపిస్తోంది. ఇల్లెందు, వైరా మున్సిపల్ ఛైర్మన్లపై గతంలోనే పలువురు కౌన్సిలర్లు అవిశ్వాస తీర్మాన నోటీసులు కలెక్టర్లకు అందజేశారు. ఇల్లెందుకు సంబంధించి ఫార్మాట్‌లో లేదని కలెక్టర్ తిరస్కరించగా.. మరోసారి నోటీసు ఇచ్చారు. వైరా ఛైర్మన్‌పై పలువురు కౌన్సిలర్లు అవిశ్వాస తీర్మానం అందజేయగా.. చట్టంపై స్పష్టత లేకపోవడంతో నిర్ణయం వెలువడలేదు. ప్రస్తుతం రాష్ట్రంలో అధికారం మారడంతో పాత మున్సిపల్ చట్టం ఆధారంగా అవిశ్వాస అంశం మళ్లీ తెరపైకి వచ్చింది. వైరా, ఇల్లెందు మున్సిపల్ ఛైర్మన్లు కాంగ్రెస్‌లో, ఖమ్మం కార్పొరేషన్, సత్తుపల్లి, మధిర, కొత్తగూడెం మున్సిపల్ పాలకవర్గాలు బీఆర్‌ఎస్ చేతిలో ఉన్నాయి. ఈ నేపథ్యాన ఎక్కడెక్కడ అవిశ్వాసం పెట్టే అవకాశముంది, తద్వారా పాలకవర్గాలు మారుతాయా అనే చర్చ జరుగుతోంది.

పాలకవర్గాల్లో విభేదాలు

ఏడాది కాలంగా పలు మున్సిపల్ పాలకవర్గాల్లో విభేదాలు పొడచూపాయి. పార్టీ తరఫున ఎన్నికైన ఛైర్మన్లకు, నాయకత్వానికి పొసగకపోవడం, కౌన్సిలర్లు – ఛైర్మన్‌కు మధ్య విభేదాల వంటి కారణాలతో అవిశ్వాసానికి అడుగులు పడ్డాయి. మరికొన్ని చోట్ల అవిశ్వాస తీర్మానానికి నిర్ణయించినా సర్దుబాట్లతో ముందుకు సాగలేదు. ఇల్లెందు, వైరాలో మాత్రం అవిశ్వాస తీర్మాన నోటీసులు కలెక్టర్లకు అందాయి. మున్సిపాలిటీ, కార్పొరేషన్ పాలకవర్గాలపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టాలంటే మూడేళ్ల పదవీ కాలం పూర్తి కావాలని చట్టంలో ఉంది. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం దీన్ని నాలుగేళ్లకు పెంచి గవర్నర్‌కు పంపించగా ఆమోదం లభించలేదు. దీంతో ఇల్లెందు, వైరా తీర్మానాలపై కలెక్టర్లు నిర్ణయం తీసుకోలేదు.

మరోసారి తెరపైకి..

రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో అవిశ్వాస అంశం మరోసారి తెరపైకి వచ్చింది. బీఆర్‌ఎస్ సర్కారు తెచ్చిన నాలుగేళ్ల చట్టానికి గవర్నర్ ఆమోదం లభించకపోవడంతో, మూడేళ్లు దాటిన పాలకవర్గాలపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టే వెసులుబాటు ఉంది. ఉమ్మడి జిల్లాలోని మున్సిపల్ పాలకవర్గాలు 2020 జనవరిలో కొలువుదీరాయి. ప్రస్తుతం మూడేళ్లు దాటడంతో అవిశ్వాస తీర్మానం పెట్టే అవకాశముంది. గతంలో అవిశ్వాసానికి యత్నించిన వైరా, ఇల్లెందు మున్సిపాలిటీల ఛైర్మన్లు ప్రస్తుతం కాంగ్రెస్‌లో చేరడంతో బలాబలాలు మారాయి. మిగతా మున్సిపాలిటీల్లో బీఆర్‌ఎస్‌కు మెజార్టీ ఉన్నా.. వచ్చే నాలుగు నెలల్లో రాజకీయ సమీకరణలతో తమ బలం పెరుగుతుందన్న అంచనాలో కాంగ్రెస్ ఉంది. తద్వారా అవిశ్వాసం పెట్టి ఆయా మున్సిపాలిటీలను హస్తగతం చేసుకుంటామని ఆ పార్టీలో చర్చ జరుగుతోంది.

ఖమ్మంపై రాజకీయ కాక..

ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్‌పై రాజకీయ కాక మొదలైంది. ఈ పాలకవర్గం 2021 మే 7న కొలువుదీరింది. 60 డివిజన్లలో బీఆర్‌ఎస్, సీపీఐ కలిసి పోటీ చేయగా.. బీఆర్‌ఎస్ 43, సీపీఐ రెండు స్థానాల్లో గెలుపొందాయి. కాంగ్రెస్ 10, సీపీఎం, స్వతంత్రులు రెండేసి స్థానాలు, బీజేపీ ఒక స్థానం దక్కించుకున్నాయి. దీంతో బీఆర్‌ఎస్ పగ్గాలు చేపట్టగా, ఆ తర్వాత ముగ్గురు కాంగ్రెస్ కార్పొరేటర్లు బీఆర్‌ఎస్‌లో చేరారు. అసెంబ్లీ ఎన్నికల సమయాన స్వతంత్ర అభ్యర్థులు ఇద్దరు కాంగ్రెస్‌లో చేరగా.. బీఆర్‌ఎస్‌కు చెందిన తొమ్మిది మంది సైతం కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. దీంతో కాంగ్రెస్ బలం 18కి చేరగా, బీఆర్‌ఎస్‌కు 37 మంది ఉన్నారు. వచ్చే ఏడాది మే 7తో కేఎంసీ పాలకవర్గం మూడేళ్లు పూర్తి చేసుకోనుంది. ఇప్పటివరకు బీఆర్‌ఎస్‌కే బలం ఉన్నా, వచ్చే నాలుగు నెలల్లో మారే సమీకరణలతో తమ బలం పెరిగి కార్పొరేషన్‌ను 'హస్త'గతం చేసుకుంటామని కాంగ్రెస్ నేతలు అంటున్నారు. అయితే తమ కార్పొరేటర్లెవరూ కాంగ్రెస్ వైపు చూడరని బీఆర్‌ఎస్ నేతలు ధీమాగా ఉన్నారు.

వైరా, ఇల్లెందుల్లో ఇలా..

ఎన్నికలకు ముందు బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు వైరా మున్సిపల్ ఛైర్మన్ సూతకాని జైపాల్‌పై కలెక్టర్‌కు అవిశ్వాస నోటీసులు ఇచ్చారు. ఇక్కడ బీఆర్‌ఎస్‌కు 16 మంది, కాంగ్రెస్‌కు ఇద్దరు, సీపీఎంకు ఒకరు, స్వతంత్ర కౌన్సిలర్ ఒకరు ఉన్నారు. ఎన్నికల అనంతరం కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌కు పదేసి మంది కౌన్సిలర్లు ఉన్నారు. అయితే మరికొందరు కాంగ్రెస్‌లో చేరే అవకాశముందనే ప్రచారం జరుగుతోంది. ఇక ఇల్లెందు మున్సిపాలిటీలో ఏడాది కాలంగా ఛైర్మన్‌కు వ్యతిరేకంగా కౌన్సిలర్లు కార్యకలాపాలు సాగిస్తున్నారు. ఇక్కడ 24 వార్డులకు గాను ఛైర్మన్ డి.వెంకటేశ్వర్లు, వైస్ ఛైర్మన్ జానీపాషాతో పాటు 21 మంది బీఆర్‌ఎస్ నుంచి గెలిచారు. సీపీఐ, న్యూడెమోక్రసీ, బీఆర్‌ఎస్ రెబల్‌గా ఒక్కొక్కరు గెలుపొందారు. ఇటీవల బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు ఛైర్మన్‌పై కలెక్టర్‌కు అవిశ్వాసం నోటీసు ఇచ్చినా ఫార్మాట్ ప్రకారం లేదనడంతో వారం క్రితం మళ్లీ ఇచ్చారు. మాజీ ఎమ్మెల్యే హరిప్రియ, ఆమె భర్త హరిసింగ్ ప్రోద్బలంతో ఈ ప్రక్రియ సాగుతున్నట్లు సమాచారం. ఇదిలా ఉండగా.. ఎన్నికల ముందు మున్సిపల్ ఛైర్మన్ సహా నలుగురు కౌన్సిలర్లు కాంగ్రెస్‌లో చేరడంతో ప్రస్తుతం బీఆర్‌ఎస్ బలం 17కు తగ్గింది. వైరా, ఇల్లెందులో ఎమ్మెల్యేలు కాంగ్రెస్ వారు గెలవడం, ఆ పార్టీకే చెందిన ఛైర్మన్లు ఉండడంతో ఆ పార్టీ నేతలు ఎలా చక్రం తిప్పుతారో వేచి చూడాల్సిందే.

ఇక్కడా సందేహమే..

- సత్తుపల్లి మున్సిపాలిటీలో 23 వార్డులకు అన్నీ బీఆర్‌ఎస్సే గెలిచింది. అసెంబ్లీ ఎన్నికల ముందు ఐదుగురు కాంగ్రెస్‌లో చేరడంతో ప్రస్తుతం బీఆర్‌ఎస్ బలం 18కి తగ్గింది. ఇక్కడ బీఆర్‌ఎస్‌కు చెందిన కూసంపూడి మహేష్ ఛైర్మన్‌గా, వైస్ ఛైర్మన్‌గా ఇటీవల కాంగ్రెస్‌లో చేరిన తోట సుజలారాణి ఉన్నారు.
- కొత్తగూడెం మున్సిపాలిటీలో బీఆర్‌ఎస్‌కు చెందిన కాపు సీతాలక్ష్మి ఛైర్‌పర్సన్‌గా, వేల్పుల దామోదర్ వైస్‌ఛైర్మన్‌గా ఉన్నారు. ఛైర్‌పర్సన్‌పై వ్యతిరేకతతో బీఆర్‌ఎస్, సీపీఐ కౌన్సిలర్లు గతంలో అవిశ్వాస తీర్మానానికి ప్రయత్నించినా, ఇప్పుడెలాంటి కదలికా లేదు. ఇక్కడ 36 వార్డులకు గాను బీఆర్‌ఎస్‌కు 25, సీపీఐకి ఎనిమిది మంది, కాంగ్రెస్‌కు ఒకరు, స్వతంత్రులు ఇద్దరు ఉన్నారు. ఎన్నికల ముందు సీపీఐ కౌన్సిలర్లు ఐదుగురు బీఆర్‌ఎస్‌లో చేరగా ఆ పార్టీ బలం 30కి పెరిగింది. సీపీఐకి ముగ్గురే మిగిలారు.
- మధిరలో 22 వార్డులకు బీఆర్‌ఎస్‌కు 15 మంది, కాంగ్రెస్‌కు ఇద్దరు, టీడీపీ నుంచి ముగ్గురు, సీపీఎం, స్వతంత్ర అభ్యర్థి ఒక్కొక్కరు గెలిచారు. బీఆర్‌ఎస్‌కు చెందిన ఎర్రగుంట లక్ష్మి, మొండితోక నాగరాణి అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్‌లో చేరారు. స్వతంత్ర కౌన్సిలర్ గద్దల మాధురి ప్రమాణ స్వీకారానికి ముందే బీఆర్‌ఎస్‌లో చేరారు. 20వ వార్డు కౌన్సిలర్ ముత్తవరపు రాణి అనారోగ్యంతో మృతి చెందగా ఆ స్థానం ఖాళీగా ఉంది. దీంతో ప్రస్తుతం బీఆర్‌ఎస్‌లో 13 మంది, కాంగ్రెస్‌కు నలుగురు, టీడీపీ ముగ్గురు, సీపీఎంకు ఒకరు ఉన్నారు. ఛైర్‌పర్సన్ మొండితోక లత, వైస్ ఛైర్‌పర్సన్ శీలం విద్యాలత బీఆర్‌ఎస్‌లో గెలిచి అదే పార్టీలో కొనసాగుతున్నారు.

వామనావతారంలో రామయ్య దర్శనం..

- కమనీయంగా సాగుతున్న అధ్యయనోత్సవాలు
- ధనుర్మాసోత్సవాలలో ఆండాళ్ తల్లికి తిరువీధి సేవ



బేడా మండపంలో స్వామివారికి హారతి సమర్పిస్తున్న అర్చకులు

భద్రాచలం: బలిచక్రవర్తి గర్వమును అణచేందుకు వెలిసి మూడు అడుగులను కోరి రాక్షస రాజుకు గర్వభంగం చేసిన వామనావతారంలో శ్రీసీతారామ చంద్రస్వామి దర్శనమిచ్చారు. వైకుంఠ ఏకాదశి ప్రయుక్త అధ్యయనోత్సవాలు ఐదో రోజుకు చేరగా, ఆదివారం స్వామివారిని వామన అవతారంలో భక్తులు దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. తొలుత గర్భగుడిలో సుప్రభాత సేవ, ఆరాధన తదితర పూజలు గావించారు. వేద పండితులు రెండు వందల పాశురముల ప్రబంధాలను సమర్పించారు. వామనావతారంలో అలంకరించిన స్వామివారికి బేడా మండపంలో పూజలు నిర్వహించి, ఆలయం నుంచి ఊరేగింపుగా మిథిలా స్టేడియానికి తీసుకొచ్చారు. ప్రత్యేక వేదికపై కొలువుదీర్చగా, భక్తులు దర్శించుకుని శ్రీరామ నామస్మరణ చేశారు. ఊరేగింపులో మహిళా భక్తులు కోలాటంతో ఆకట్టుకున్నారు. అనంతరం తిరువీధి సేవ జరిపారు. ఆదివారం సెలవు రోజు కావడంతో దేవస్థానంలో భక్తుల రద్దీ నెలకొంది.

ధనుర్మాసోత్సవాలలో తిరువీధి సేవ

దేవస్థానంలో జరుగుతున్న ధనుర్మాసోత్సవాలలో భాగంగా ఆండాళ్ అమ్మవారికి ఘనంగా తిరువీధి సేవ జరిపారు. ఆలయం నుంచి తాతగుడి సెంటర్ వరకు జరిపిన ఈ సేవలో ఆలయ ఈఓ రమాదేవి పాల్గొన్నారు. ఆలయంలో పండితులు తిరుప్పావై ప్రవచనాలను అమ్మవారికి సమర్పించారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ప్రధాన అర్చకులు పొడిచేటి జగన్నాథాచార్యులు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ సాయిబాబు, సీసీ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయ నిర్మాణం తృప్తినిచ్చింది

- ఎంపీ బండి పార్థసారధిరెడ్డి
- లైబ్రరీ ప్రారంభించి ప్రభుత్వానికి అప్పగింత



గ్రంథాలయాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ పార్థసారధిరెడ్డి, ఎమ్మెల్యే రాగమయి తదితరులు

సత్తుపల్లి: తాను చదువుకున్న ఈ ప్రాంతానికి అంతర్జాతీయ స్థాయిలో గ్రంథాలయాన్ని నిర్మించి ఇవ్వడం సంతృప్తిని ఇచ్చిందని ఎంపీ బండి పార్థసారధిరెడ్డి అన్నారు. సత్తుపల్లిలో రూ.2 కోట్లతో అత్యాధునికంగా నిర్మించిన డాక్టర్ బండి పార్థసారధిరెడ్డి గ్రంథాలయాన్ని స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయితో కలిసి ఆదివారం ప్రారంభించి ప్రభుత్వానికి అప్పగించారు. అనంతరం పార్థసారధిరెడ్డి విలేకరులతో మాట్లాడుతూ గ్రంథాలయం ఏర్పాటుకు సండ్ర వెంకటవీరయ్య, కలెక్టర్ వి.పి. గౌతమ్ సంపూర్ణంగా సహకరించారని, అందుకే తక్కువ కాలంలోనే నిర్మాణం పూర్తయిందని చెప్పారు. లైబ్రరీలో అవసరమైన పుస్తకాలు, కంప్యూటర్లను అందుబాటులోకి తెస్తున్నామని, ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకుని పోటీ పరీక్షల్లో రాణించాలని కోరారు. మాజీ ఎమ్మెల్యే వెంకటవీరయ్య మాట్లాడుతూ నిరుద్యోగులు, యువత, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ కొత్తూరు ఉమామహేశ్వరరావు, ఎంపీపీ దొడ్డా హైమావతి, హెటిరో డైరెక్టర్ రత్నారెడ్డి, దాసరి ప్రభాకర్‌రెడ్డి, గోగుల మూడి బాలాజీరెడ్డి, శీలపురెడ్డి హరికృష్ణారెడ్డి, దొడ్డా శంకర్‌రావు, కంటే నాగలక్ష్మి, కోటగిరి సుధాకర్‌బాబు, గాదె చెన్నారావు, ఎండీ కమల్‌పాషా, చల్లగుండ్ల కృష్ణయ్య, కూసంపూడి రామారావు, మానుకోట మధు పాల్గొన్నారు.

పెద్దాస్పత్రిలో కలెక్టర్ తనిఖీ



బాలింతల సహాయకులతో మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమ్

ఖమ్మం వైద్యవిభాగం : ఖమ్మం ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రిని కలెక్టర్ వి.పి గౌతమ్ ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మాతాశిశు ఆరోగ్య కేంద్రం వద్ద ఉన్న వారితో మాట్లాడి అందుతున్న ఆరోగ్య సేవలపై ఆరా తీశారు. అనంతరం లేబర్ రూంను పరిశీలించారు. రిజిస్టర్లు తనిఖీ చేసి వైద్యులతో పాటు సిబ్బంది ఎంత మంది విధుల్లో ఉన్నారో తెలుసుకున్నారు. అనంతరం ఎస్‌ఎన్‌సీయూను పరిశీలించారు. బాలింతలతో మాట్లాడి వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అధికారులకు పలు సూచనలు చేశారు. డెలివరీల సంఖ్య పెంచాలని, సాధారణ ప్రసవాలు పెంచేలా సిబ్బంది కృషి చేయాలని చెప్పారు. పేషెంట్లకు నాణ్యమైన భోజనం అందించాలన్నారు. వైద్యులు సమయపాలన పాటించాలని, చిన్నపిల్లల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ ఆస్పత్రులకు పేదలే ఎక్కువగా వస్తారని, మెరుగైన సేవలు అందించి ఆస్పత్రులపై నమ్మకం పెంచాలని అన్నారు. కార్పొరేట్ ఆస్పత్రులకు దీటుగా ప్రభుత్వ దవాఖానాల్లో వైద్య సేవలు అందిస్తున్నామని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం కలెక్టర్ ఆరోగ్య పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో ఆర్‌ఎంఓ డాక్టర్ రాంబాబు, గైనిక్ వైద్యులు కృపా ఉషశ్రీ తదితరులు పాల్గొన్నారు.

'సివిల్ సర్వీసెస్' కౌన్సిల్‌ను పునరుద్ధరించాలి



మాట్లాడుతున్న మహబూబ్ అలీ

ఖమ్మం సహకారనగర్: రాష్ట్రంలో ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల సివిల్ సర్వీసెస్ జాయింట్ స్టాఫ్ కౌన్సిల్‌ను పునరుద్ధరించాలని ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్‌యూటీఎఫ్) రాష్ట్ర ఆడిట్ కమిటీ కన్వీనర్ షేక్ మహబూబ్ అలీ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. నగరంలోని సంఘ కార్యాలయంలో ఆదివారం జరిగిన జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ప్రజాస్వామ్యయుతంగా వ్యవహరించాలని, ఉద్యోగ, ఉపాధ్యాయ, శ్రామికుల సమస్యలపై సానుకూలంగా స్పందించాలని కోరారు. పెండింగ్ సమస్యలు పరిష్కరించాలన్నారు. సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జీవీ నాగమల్లేశ్వరరావు, పారుపల్లి నాగేశ్వరరావు మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయులు, విద్యాసంస్థలకు సంబంధించిన 23 తీర్మానాలను సమావేశంలో ఆమోదించి ప్రభుత్వానికి నివేదించనున్నట్లు తెలిపారు. సమావేశంలో బండి నరసింహారావు, నెల్లూరి వీరబాబు, బుర్రి వెంకన్న, వల్లంకొండ రాంబాబు, ఎం.మహేష్ పాల్గొన్నారు.

గాన దేవుడిగా ఘంటసాలకు గుర్తింపు

- ప్రముఖ సినీ సంగీత దర్శకులు సాలూరి వాసూరావు
- 'భలే మంచిరోజు' నిర్వహణ అభినందనీయం



ఘంటసాలకు నివాళి అర్పిస్తున్న సినీ సంగీత దర్శకులు సాలూరు వాసూ రావు తదితరులు

ఖమ్మంగాంధీచౌక్: ఘంటసాల వెంకటేశ్వరరావు అమర గాయకులని, ప్రపంచ వ్యాప్తంగా ఆయన ఒక్కరే గానదేవుడిగా గుర్తింపు పొందారని ప్రముఖ సినీ సంగీత దర్శకులు సాలూరు వాసూరావు అన్నారు. ఘంటసాల జయంతి సందర్భంగా నగరంలోని భక్తరామదాసు కళాక్షేత్రంలో ఆదివారం రాత్రి సుదాస్ ఎంటర్‌టైన్‌మెంట్స్ ఆధ్వర్యంలో భలే మంచిరోజు కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన సాలూరి మాట్లాడుతూ.. ఘంటసాల ప్రజల హృదయాల్లో చిరస్మరణీయంగా ఉన్నారని అన్నారు. ఘంటసాల శత జయంతిని పురస్కరించుకుని భలే మంచి రోజు కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఐఏఎస్ అధికారి హెచ్.అరుణ్‌కుమార్ మధుర గీతాలను ఆలపించడం హర్షణీయమన్నారు. తెలుగు రాష్ట్రాల్లో ఇలాంటి కార్యక్రమాలు మరెన్నో నిర్వహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సుదాస్ ఎంటర్‌టైన్‌మెంట్స్ అధ్యక్షుడు డాక్టర్ టి. వాసుదేవ్, కార్యదర్శి శఠగోపం సుదర్శన్, సమన్వయకర్త విజయ సారధి, ఖమ్మం కళాపరిషత్ అధ్యక్షుడు డాక్టర్ నాగబత్తిని రవికుమార్, మహ్మద్ జాన్‌పాషా, మహ్మద్ అజీజ్, కాళ్ల పాపారావు తదితరులు పాల్గొన్నారు. ముందుగా కుమారి పంచకర్ల హరిశ్రీ ఘంటసాల సంగీత నృత్య విలాసంతో అలరించారు. విజయనగర్‌కు చెందిన పవన్ చరణ్, హైదరాబాద్‌కు చెందిన బీవీఎల్‌ఎన్ పద్మావతి, సురేఖా మూర్తి, శశికళా స్వామి, ఖమ్మానికి చెందిన ఎస్వీ రమణ, నాగస్వర్ణశ్రీ పాడిన పాటలు అలరించాయి.

పాలేరుకు ఏం కావాలి..

- పెండింగ్, అభివృద్ధి పనులపై మంత్రి పొంగులేటి నజర్
- నియోజకవర్గం ప్రత్యేకంగా నిలిచేలా దృష్టి
- తన మార్క్ చూపించేలా ప్రణాళిక
- నేడు కలెక్టర్, అధికారులతో సమీక్ష



మద్దులపల్లిలో పూర్తికాని వ్యవసాయ మార్కెట్

సాక్షిప్రతినిధి, ఖమ్మం: పాలేరు నియోజకవర్గ అభివృద్ధిపై రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి దృష్టి పెట్టారు. పాలేరుపై తన మార్క్ చూపేలా ప్రణాళికలు సిద్ధం చేసే పని ప్రారంభించారు. ప్రధానంగా ఉమ్మడి ఖమ్మం జిల్లాను సస్యశ్యామలం చేసే సీతారామ ప్రాజెక్టు పనులు ఈ నియోజకవర్గంలో నత్తనడకన సాగుతున్నాయి. ఇక నర్సింగ్, ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాలలకు శాశ్వత భవనాలు లేవు. ఖమ్మం రూరల్ మండలం మద్దులపల్లిలో రూ.25 కోట్లతో చేపట్టిన వ్యవసాయ మార్కెట్ నిర్మాణాన్ని వేగవంతం చేయాల్సిన అవసరం ఉంది. తిరుమలాయపాలెం మండలంలో బోదకాలు బాధితులు అత్యధికంగా ఉన్నారు. వీరికి పింఛన్ అందడం లేదు. నియోజకవర్గంలో పలు సమస్యలతోపాటు గత ప్రభుత్వం హామీ ఇచ్చి పూర్తి కాకుండా పెండింగ్‌లో ఉన్న పనులు, ఇంకా చేపట్టాల్సిన పనులు అనేకం ఉన్నాయి. వీటన్నింటినీ పూర్తి చేయడం ద్వారా నియోజకవర్గంపై చెరగని ముద్ర వేయాలనే ఆలోచనతో మంత్రి పొంగులేటి రంగంలోకి దిగుతున్నారు. ఆయా పనులపై చర్చించేందుకు కలెక్టర్ వి.పి.గౌతమ్, ఇతర జిల్లా, నియోజకవర్గ అధికారులతో సోమవారం కలెక్టరేట్‌లో సమీక్ష సమావేశం నిర్వహించనున్నారు.

మార్కెట్ పనుల్లో జాప్యం..

ఖమ్మం రూరల్ మండలంలో పలు సమస్యలు పరిష్కరించాల్సి ఉంది. ఇందులో వ్యవసాయ మార్కెట్ నిర్మాణం ప్రధానమైంది. నర్సింగ్, ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాలలకు శాశ్వత భవనాలు లేవు. మద్దులపల్లిలో రూ.25 కోట్లతో చేపట్టిన మార్కెట్ పనులు నత్తనడకన సాగుతున్నాయి. యాసంగికి సాగర్ నీరు రాక దాదాపు వెయ్యి ఎకరాలు బీడుగా మారాయి. మండలంలోని గ్రామీణ ప్రాంతాలను కలిపే లింక్ రోడ్లు భారీ గుంతలతో అధ్వానంగా తయారయ్యాయి. ఎం.వెంటాయపాలెంను మండల కేంద్రం చేయాలనే డిమాండ్ ఎప్పటి నుంచో ఉంది. పెదతండా, ఏదులాపురం, గుర్రాలపాడు, వెంకటగిరి, గుదిమళ్ల పంచాయతీలను ఖమ్మం కార్పొరేషన్‌లో విలీనం చేసి, ఆ తర్వాత ప్రజల నుంచి వచ్చిన అభ్యంతరాలతో గ్రామ పంచాయతీలుగా మార్చినా ప్రత్యేకాధికారుల పాలనతో అభివృద్ధి ముందుకు సాగడం లేదు. డ్రెయిన్లలో పేరుకుపోయిన చెత్త, మురుగునీటిని తొలగించే పరిస్థితి కూడా లేదు. జలగంనగర్ నుంచి కోదాడ క్రాస్‌రోడ్ వరకు, వెంకటగిరి క్రాస్ రోడ్ నుంచి ఎం.వెంకటాయపాలెం వరకు రెండు వరుసల రహదారి, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాల్సి ఉంది.

కదలని సీతారామ..

ఉమ్మడి జిల్లాకు వరప్రదాయనిగా చెప్పుకునే సీతారామ ప్రాజెక్టు పనులు తిరుమలాయపాలెం మండలంలో మందకొడిగా సాగుతున్నాయి. దమ్మాయిగూడెం నుంచి పోచారం వరకు నిర్మించాల్సిన అండర్ టన్నెల్ పనుల్లో పురోగతి లేదు. కేశవాపురం నుంచి బీచ్‌రాజ్‌పల్లి వరకు ఆకేరుపై రోడ్ కం బ్రిడ్జి చెక్‌డ్యాం నిర్మించాల్సి ఉంది. పాలేరు వాగుపై ముజాహిద్‌పురం నుంచి సూర్యాపేట జిల్లా ముస్తేపురం వరకు బ్రిడ్జి నిర్మించాలి. తిరుమలాయపాలెంలో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాలి. బచ్చోడును మండలంగా చేయాలనే డిమాండ్ ఉంది. ఎదుళ్లచెరువు, తిరుమలాయపాలెం గ్రామాలకు కాలువలు లేక భక్తరామదాసు నీరు అందడం లేదు. అర్హులైన బోదకాలు వ్యాధిగ్రస్తులకు పింఛన్‌లు పెండింగ్‌లో ఉన్నాయి.

అందని భక్తరామదాసు ఫలాలు..

కూసుమంచి మండలంలో సుమారు 5 వేల ఎకరాలకు భక్తరామదాసు ప్రాజెక్టు నుంచి నీళ్లు అందాలి. ఇంకా కాల్వల నిర్మాణం పూర్తి కాలేదు. రాజుపేట–ఈశ్వరమాధారం గ్రామాల మధ్య వాగుపై నిర్మిస్తున్న వంతెన పూర్తి కాలేదు. పాలేరులోని మత్స్య పరిశోధన కేంద్రానికి శిక్షణకు వచ్చే వారి కోసం హాస్టల్ నిర్మించాలి. మండలంలో కొత్తగా ఏర్పాటైన పంచాయతీలకు భవనాలు నిర్మించలేదు. కూసుమంచిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వరకు సెంట్రల్ లైటింగ్ ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధమైనా పనులు పూర్తి కాలేదు. ఇక మండలంలోని పలు గ్రామాల్లో సీసీ రోడ్లు లేవు.

వారధులు అవసరం..

నేలకొండపల్లి బస్టాండ్‌ను వినియోగంలోకి తీసుకురావాలి. గ్రామంలో సెంట్రల్ లైటింగ్ పనులు అసంపూర్తిగా ఉన్నాయి. ముజ్జుగూడెంలో పశువైద్యశాల కూల్చి ఏడాదిన్నర అయినా నిర్మించలేదు. కొరట్లగూడెంలో అంగన్‌వాడీ కేంద్రం శిథిలావస్థలో ఉంది. బుద్దారం వద్ద వాగుపై బ్రిడ్జి నిర్మించాలి. ఇక్కడ చప్టా మాత్రమే ఉండటంతో వరదలు వచ్చినప్పుడు పలు గ్రామాలకు రాకపోకలు నిలుస్తున్నాయి. చెరువు మాదారంలో రాళ్లబంధం వాగు వద్ద చప్టా నిర్మించాలి. అనాసాగారం, కోనాయిగూడెం కాల్వలపై వంతెనలు శిథిలావస్థకు చేరడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. కోనాయిగూడెం –బోదులబండ, ముజ్జుగూడెం – గువ్వలగూడెం గ్రామాల మధ్య బీటీ రోడ్డు నిర్మించాలి.

క్లుప్తంగా

పోస్టింగ్‌ల కోసం పోలీస్ అధికారుల ప్రదక్షిణలు..

ఖమ్మంక్రైం: తెలంగాణలో కొత్తగా వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో జిల్లాలోని పోలీస్‌శాఖలో బదిలీల వ్యవహారం జోరందుకోనున్నాయి. గత ప్రభుత్వంలో విధులు నిర్వర్తిస్తున్న ఏసీపీల దగ్గర నుంచి సీఐల వరకు తమ పోస్టింగ్‌లు కాపాడుకోవడంతో పాటు తమకు నచ్చిన ప్రాంతంలో పోస్టింగ్‌ల కోసం అధికారపార్టీ నాయకుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. అందులో సీఐలు నానా రకాల ప్రయత్నాలు చేస్తుండగా.. కొంతమంది అధికారులు సెలవులో వెళ్లి రాష్ట్ర రాజధానిలో నాయకులను ప్రసన్నం చేసుకునే పనిలో ఉన్నట్లు తెలిసింది. ముఖ్యంగా జిల్లా కేంద్రం అయిన ఖమ్మం పోలీస్ స్టేషన్లకు పోటీ భారీగా ఉన్నట్లు సమాచారం. గత ప్రభుత్వంలో పోస్టింగ్‌లలో నియమితులైన అందరికీ స్థానచలనం తప్పక ఉంటుందని ఊహాగానాలు వస్తుండడంతో కీలక పోస్టింగ్‌ల కోసం తమకు పరిచయం ఉన్న అధికార పార్టీ నాయకుల ద్వారా తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. ఖమ్మంలోని అన్ని పోలీస్ స్టేషన్‌లకు సంబంధించి సీఐల పోస్టింగ్‌ల కోసం భారీ పోటీ ఉండనుందని తెలిసింది.

నూతన సంవత్సరంలోనే బదిలీలు..

జిల్లాలో పోలీస్‌శాఖలోని బదిలీలు నూతన సంవత్సరంలోనే ఉంటాయని తెలుస్తోంది. అయితే పంచాయతీ ఎన్నికలు పాటు త్వరలో ఎంపీ ఎన్నికలు కూడా ఉండడంతో ఎన్నికల ముందే భారీగా బదిలీలు ఉంటాయని సమాచారం.

యాభై ఏళ్ల అ'పూర్వ'కలయిక..



కార్యక్రమానికి హాజరైన పూర్వ విద్యార్థులు

కామేపల్లి: కామేపల్లి ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి(1974–75 బ్యాచ్) చదివిన విద్యార్థులు తాము చదువుకున్న పాఠశాలలోనే ఆదివారం గోల్డెన్ జూబ్లీ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు.ఈ సందర్భంగా నాటిజ్ఞాపకాలు నెమరేసుకుంటూ, ఒకరినొకరు అప్యాయంగా పలకరించుకుని సందడి చేశారు. ఈమేరకు నాడు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సత్కరించారు. పాఠశాల అభివృద్ధికి చేపట్టే కార్యక్రమాలపై చర్చించాక అందరూ కలిసి విందు భోజనాలు ఆరగించారు. ఆ కార్యక్రమాల్లో కడవెండి శ్రీనివాస్, రాయల సత్యనారాయణ, గోవిందం రామకృష్ణ, కామ సర్వయ్య, తడికమళ్ల భిక్షమయ్య, శ్రీరంగం మాధవరావు, నల్లమోతు కోటేశ్వరరావు, నాటి గురువులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.


గృహనిర్మాణ సంస్థ సహాయక ఇంజనీర్ల సంఘం ఎన్నిక




బొగ్గుల వెంకటరామిరెడ్డి, జి.వెంకయ్య

ఖమ్మంసహకారనగర్: తెలంగాణ రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ సహాయక ఇంజనీర్లు అండ్ ఇన్‌స్పెక్టర్లు రాష్ట్ర కమిటీ ఎన్నికలు ఆదివారం జరిగాయి. సంఘ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బొగ్గుల వెంకటరామిరెడ్డి, జాయింట్ సెక్రటరీగా జి.వెంకయ్యలు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ.. ప్రస్తుత తెలంగాణ ప్రభుత్వంలో అమలు చేస్తున్న ఆరు గ్యారంటీలలో ఇందిరమ్మ హౌసింగ్‌కు ప్రాధాన్యం ఇస్తూ పేదలకు నీడ కల్పించుటకు పూనుకోవడం అభినందించాల్సిన విషయం అన్నారు. అందుతో గృహ నిర్మాణశాఖ మంత్రిగా మన ఖమ్మం జిల్లా నుంచి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రాతినిధ్యం వహించడం గర్వకారణమన్నారు. హౌసింగ్ ఉద్యోగుల సమస్యలను సానుకూలంగా పరిశీలించి పరిష్కరిస్తారని ఆశిస్తున్నామని అన్నారు.

మత్స్యకారుల చేతిలో కొండచిలువ హతం



హతమైన కొండచిలువతో మత్స్యకారుడు

తిరుమలాయపాలెం: మండలంలోని పిండిప్రోలు గ్రామంలో గల ఊర చెరువులో చేపల వేటకు వెళ్లిన మత్స్యకారుల వలకు భారీ కొండచిలువ చిక్కింది. ఆదివారం చోటు చేసుకున్న ఈ సంఘటన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన మత్స్యకారులు చెరువులో చేపల వేటకు వెళ్లగా.. అందులో ఏర్పాటు చేసిన వలకు భారీ కొండచిలువ చిక్కింది. దీన్ని గమనించిన మత్స్యకారులు భయభ్రాంతులకు గురై వలన బయటకు తీశారు. దీంతో సుమారు 15 అడుగుల కొండచిలువ బయట పడగా.. దాన్ని రాళ్లతో కొట్టి చంపారు. ఈ విషయాన్ని తెలుసుకున్న గ్రామస్తులుకొండచిలువను చూసేందుకు ఆసక్తి కనబరిచారు.



పామాయిల్ గెలలు	
టన్ను ధర	రూ.12,454

కొత్త సర్కార్‌పైనే ఆశలు..

- పింఛన్ పెంపు ప్రకటన కోసం ఎదురుచూపులు
- 'చేయూత' అమలు చేస్తే రూ.4వేల పెన్షన్
- ఉమ్మడి జిల్లాలో 3.11 లక్షలకు పైగా లబ్ధిదారులు



ఖమ్మంమయూరిసెంటర్: రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పడడంతో ఆసరా పెన్షన్ లబ్ధిదారుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. ఎన్నికలకు ముందు ఆరు గ్యారంటీల హామీలను ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో గెలిచి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. హామీల్లో భాగంగా సీఎంగా రేవంత్‌రెడ్డి ప్రమాణస్వీకారం చేసిన తొలి రోజు ఆరు గ్యారంటీలపై సంతకం చేశారు. ఈ గ్యారంటీల్లో ఆసరా పెన్షన్ అందుకుంటున్న లబ్ధిదారులకు చేయూత పథకం కింద రూ.4,000 లకు పెంచి అమలు చేస్తామని ప్రకటించింది. ప్రభుత్వం ఏర్పడడం, రెండు పథకాలను ఇప్పటికే ప్రారంభించడంతో ఆసరా లబ్ధిదారులు తమ గ్యారంటీ కూడా అమలవుతుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. చేయూత కింద ఇచ్చిన హామీల్లో రాజీవ్ ఆరోగ్యశ్రీకి రూ.10 లక్షలు పెంచి అమలు చేస్తున్న ప్రభుత్వం, పెన్షన్‌లను కూడా త్వరలోనే పెంచి అమలు చేస్తారని ఆశిస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో 3,11,008 మంది..

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఆసరా పెన్షన్ అందుకుంటున్న లబ్ధిదారులు 3,11,008 మంది ఉన్నారు. వీరిలో వృద్ధులు, వితంతువులు, వికలాంగులు, చేనేత కార్మికులు, ఒంటరి మహిళలు, బీడీ కార్మికులు, ఏఆర్‌టీ, ఫైలేరియా, డయాలసిస్ బాధితులు ఉన్నారు. వికలాంగులకు ప్రస్తుతం రూ.4 వేల పెన్షన్ అందుతుండగా.. ఇతర లబ్ధిదారులకు రూ.2,016లు పెన్షన్ అందుతుంది. కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం చేయూత కింద వీరందరికి రూ.4 వేలు ఇస్తామని హామీ ఇచ్చింది. ఖమ్మం జిల్లాలో 1,91,548 మందికి నెలకు రూ.44,34,00,000లు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 1,19,460 మందికి నెలకు రూ.26,96,67,000లు పైగా చెల్లిస్తున్నారు. కొత్త ప్రభుత్వం చేయూత అమలు చేస్తే ఉమ్మడి జిల్లాలో పెన్షన్లకు చెల్లించాల్సిన నగదు భారీగా పెరగనుంది.

కేటగిరీల వారీగా పెన్షన్‌లు అందుకుంటున్న లబ్ధిదారుల సంఖ్య

కేటగిరి	ఖమ్మం	భద్రాద్రి కొత్తగూడెం
వృద్ధాప్యం	74,092	46,709
వితంతువులు	72,113	51,068
దివ్యాంగులు	28,831	13,732
గీత కార్మికులు	3,286	146
చేనేత కార్మికులు	453	17
ఏఆర్‌టీ(హెచ్‌ఐవీ)	2,668	1,221
ఫైలేరియా	1,406	177
డయాలసిస్	144	117
బీడీ కార్మికులు	02	04

ప్రణాళికతో పరీక్షలకు సన్నద్ధం కావాలి

- ఎస్సీడీడీ కస్తాల సత్యనారాయణ
- ఎస్సీ వసతి గృహ పది విద్యార్థులకు ప్రేరణ, భవిష్యత్తు మార్గదర్శక తరగతులు



ఖమ్మంమయూరిసెంటర్: జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కస్తాల సత్యనారాయణ

ఖమ్మంమయూరిసెంటర్/సత్తుపల్లిటౌన్: ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల్లో ఉంటూ పదో తరగతి విద్యనభ్యసిస్తున్న విద్యార్థులు ఒక ప్రణాళికతో వార్షిక పరీక్షలకు సన్నద్ధం కావాలని జిల్లా ఎస్సీ సంక్షేమశాఖ ఉప సంచాలకుడు కస్తాల సత్యనారాయణ అన్నారు. ప్రణాళికతో పాటు క్రమశిక్షణతో చదివితే పదిలో ఉత్తమ ఫలితాలు సాధించవచ్చన్నారు. ఆదివారం ఖమ్మంలోని ఎన్నెస్పీ కాలనీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఖమ్మం డివిజన్‌కు చెందిన ఎస్సీ సంక్షేమ వసతిగృహంలో, సత్తుపల్లిలోని ఇంటిగ్రేటెడ్ బాలికల వసతి గృహంలో గల ఎస్సీ బాలుర, బాలికల విద్యార్థులకు ప్రేరణ, భవిష్యత్తు మార్గదర్శక తరగతులను 'ప్రేరణ'పేరిట కార్యక్రమాలు నిర్వహించారు. తొలుత ఈ కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించిన కస్తాల సత్యనారాయణ మాట్లాడుతూ.. విద్యార్థులకు అవసరమైన స్టడీ మెటీరియల్, నోట్‌బుక్స్, ఇతర సామగ్రిని తెలంగాణ ప్రభుత్వం అందజేస్తుందని, వీటిని సద్వినియోగం చేసుకొని విద్యనభ్యసించాలన్నారు. ఉపాధ్యాయులు చెప్పిన పాఠ్యాంశాలలో అనుమానులు ఉంటే ఉదయం, సాయంత్రం వేళల్లో ట్యూటర్ల ద్వారా వాటిని నివృత్తి చేసుకోవాలని సూచించారు. నూరుశాతం ఫలితాలు సాధించేందుకు అటు విద్యార్థులు, ఇటు ఉపాధ్యాయులు శ్రమించాలన్నారు. ఈనేపథ్యాన ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణుడు అట్లూరి వెంకటరమణ విద్యార్థులు పరీక్షల సమయంలో ఒత్తిడిని ఎలా జయించాలి, సమయపాలన ఎలా పాటించాలి, ఏ పాఠ్యాంశం నుంచి ఎలాంటి ప్రశ్నలు వస్తాయి, వాటికి సమాధానాలు ఎలా రాయాలో వివరించారు. విద్యార్థులు ఉత్తీర్ణతపై దృష్టి పెట్టకుండా ఉత్తమ మార్కులు సాధించేందుకు పట్టుదలతో చదివితే కార్పొరేట్ కళాశాల్లో సీట్లు వస్తాయన్నారు. వారంరోజుల్లో జిల్లాలోని అన్ని హాస్టళ్లకు ఆల్‌ఇన్‌వన్‌లు పంపిణీ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్‌పీ కాలనీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శంకర్‌రావు, ఏఎస్సీడీఓలు శ్రీలత, పి.లక్ష్మీనారాయణ, వసతిగృహ సంక్షేమ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు కోటపాటి రుక్మారావు, సంక్షేమ అధికారులు బజ్జూరి వెంకటేశ్వరరావు, టి.స్టాలిన్, దారుగాబీ, జి.శ్రీనివాస్, కె.సుశీల, సీహెచ్.కృష్ణ, శ్రీనివాసరావు, ఎండీ. అబ్దుల్ రావూఫ్, ఎస్.వెంకటరెడ్డి, మురహరి, ఝాన్సీరాణి, ఎస్.విజయ, టి.విజయలక్ష్మి, ఎ.వినోద, అబ్దుల్ సత్తార్, శ్రీధర్, అన్వర్, నాగరాజు, ఓదెలు, బాలకృష్ణ, వ్యక్తిత్వ వికాస బోధకులు పి.నాగేశ్వరరావు, వునాల్గవ తరగతి సిబ్బంది పాల్గొన్నారు.

కాంస్య పతకం సాధించిన తెలంగాణ బాలుర జట్టు



కాంస్య పతకంతో తెలంగాణ బాలుర జట్టు క్రీడాకారులు

కల్లూరు: కర్నాటక రాష్ట్రంలో తాజాగా ఈ నెల 13 నుంచి 17వ తేదీ వరకు నిర్వహించిన 33వ జాతీయ సబ్ జూనియర్ ఖో–ఖో క్రీడా పోటీల్లో తెలంగాణ జట్టు ఢిల్లీ జట్టుపై పోరాడి కాంస్య పతకం సాధించింది. వివరాల్లోకి వెళితే.. ఈ నెల 1వ తేదీ నుంచి 10వ తేదీ వరకు కల్లూరులోని మినీ స్టేడియంలో ఖో–ఖో అసోసియేషన్ ఆధ్వర్యాన బాలురు, బాలికల జట్టుకు శిక్షణ శిబిరం నిర్వహించారు. ఈ శిక్షణ కార్యక్రమానికి భారత ఖో–ఖో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎంఎస్ త్యాగి, టోర్నమెంట్ నిర్వాహణ కార్యదర్శి లోకేశ్వర, మహారాష్ట్ర కేకే ఎఫ్ఐ జాయింట్ సెక్రటరీ చంద్రజిత్ జాదవ్‌లు పాల్గొని క్రీడాకారుల ప్రతిభను పరిశీలించారు.

కాగా, ఖమ్మం జిల్లా ఖో–ఖో అసోసియేషన్ బాధ్యులు గూడూరు కోటిరెడ్డి, డి.నారాయణరావు, రాజనారాయణ, చెరుకుపల్లి శ్రీహరి, శ్యామ్‌బాబు, బీజీఎఫ్ ట్రస్ట్ బాధ్యుడు ఆళ్ల రంగారావు, ప్రతిభ విద్యాసంస్థల అధినేత లక్కినేని ప్రసాద్‌ల సహాయ సహకారాలతో క్రీడాకారులకు శిక్షణ ఇచ్చి పోటీలకు పంపారు. ఈనేపథ్యాన వీరికి కాంస్య పతకం లభించగా.. ఖో–ఖో అసోసియేషన్ తరఫున ముళ్లపూడి శిరీష, చావా రాజేశ్వరీలు జట్టుకు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి



కూసుమంచి: మాట్లాడుతున్న జిల్లా సంక్షేమాధికారి జ్యోతి

కూసుమంచి: వసతి గృహాల్లో చదువుతున్న పదో తరగతి విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధికారి జి.జ్యోతి అన్నారు. ఆదివారం కూసుమంచిలోని ఇంటిగ్రేటెడ్ బీసీ బాలుర వసతిగృహంలో ఖమ్మం డివిజన్‌లోని వసతి గృహాల్లో చదువుతున్న పదో తరగతి విద్యార్థులకు ప్రేరణ తరగతులను నిర్వహించిన సందర్భంగా ఆమె మాట్లాడారు. ప్రతీ ఒక్క విద్యార్థి ఉన్న సమయాన్ని సద్వినియోగం చేసేకుంటూ మెరుగైన ఫలితాల కోసం గ్రూప్ డిస్కషన్స్ ద్వారా విద్యార్థులు తమ సందేహాలను నివృత్తి చేసుకుంటూ, ప్రైవేట్ విద్యార్థులకు దీటుగా మంచి ఫలితాలు సాధించాలన్నారు. అందుకు వెనుకబడిన విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఈనేపథ్యాన సైకాలజిస్ట్ నాగేశ్వరరావు విద్యార్థుల్లో మానసిక ఆందోళనలు పోగొట్టేలా వారికి పలు చిట్కాలను వివరించారు. వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ సహాయ అధికారి ఎం.ఈదయ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఖమ్మం డివిజన్ వసతి గృహ సంక్షేమాధికారులు నాగేశ్వరరావు, వీరభద్రరావు, వెంకటకృష్ణ, సౌజన్య, సుశీలతో పాటు ఉపాధ్యాయులు చంద్రశేఖర్, అమృ పాల్గొన్నారు.

ముగిసిన సెయింట్ ఆన్స్ క్రీడలు..

ఓవరాల్ చాంపియన్‌గా సెయింట్ జోసెఫ్ హైస్కూల్

ఖమ్మం స్పోర్ట్స్: నగరంలోని సెయింట్ జోసెఫ్ హైస్కూల్‌లో జరుగుతున్న రీజినల్ స్థాయి సెయింట్ ఆన్స్ క్రీడలు ఆదివారం విజయవంతంగా ముగిశాయి. ఈ సందర్భంగా జరిగిన బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సెయింట్ ఆన్స్ సంస్థల అధినేత రెవరెండ్ సిస్టర్ పిఅల్ఫోన్సా, పాఠశాల కరస్పాండెంట్ రెవరెండ్ సిస్టర్ మరియసుందరి, రెవరెండ్ సిస్టర్ ప్రధానోపాధ్యాయురాలు ఎస్.నక్షత్రం, రెవరెండ్ తుమ్మ సుజాత, జిల్లా పాఠశాలల క్రీడల కార్యదర్శి కె.నర్సింహామూర్తి, అథ్లెటిక్స్ సంఘం కార్యదర్శి ఎం.డీ.షఫీక్‌అహ్మద్, సీనియర్ పీఈటీ పీ.వీ.రమణలు పాల్గొని బహుమతులు అందించాక మాట్లాడారు. ఎప్పుడు చదువుతో కుస్తీ పడే విద్యార్థులకు మానసికోల్లాసం, శారీరక సామర్థ్యం పెంపొందించాలనే ఉద్దేశంతో దక్షిణాది రాష్ట్రాల్లో ప్రతీ ఏటా ఈ పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈనేపథ్యాన అయా ప్రాంతాల నుంచి వచ్చిన క్రీడాకారులు తమ స్వస్థాలకు తిరిగి వెళ్లగా.. పాఠశాలలోని ఉపాధ్యాయులకు నిర్వహణ బాధ్యతలు అప్పగించడంతో సక్రమంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల పీఈటీలు శశికళ, ఫణి, ఉపాధ్యాయులు, పీఈటీలు పాల్గొన్నారు.

విజేతలు వీరే..

రీజినల్ స్థాయి క్రీడల్లో భాగంగా బాలుర బాస్కెట్ బాల్ పోటీల్లో ప్రథమస్థానంలో ఖమ్మం సెయింట్ జోసెఫ్ హైస్కూల్, ద్వితీయ స్థానంలో కోదాడ జట్టు నిలువగా.. బాలికల బాస్కెట్‌బాల్ పోటీల్లో సెయింట్ జోసెఫ్ హైస్కూల్, ద్వితీయ స్థానంలో సికింద్రాబాద్ జట్టు నిలిచాయి. అలాగే బాలుర ఖో–ఖో పోటీల్లో సెయింట్ జోసెఫ్, ద్వితీయ స్థానంలో మంగళగిరి, త్రోబాల్ పోటీల్లో నల్లగొండ, ద్వితీయస్థానంలో సెయింట్ జోసెఫ్ హైస్కూల్ జట్లు విజయం సాధించాయి. 100 మీటర్ల పరుగు పందె పోటీల్లో ఎస్.జోస్నికా (నల్లగొండ), ఎస్.కె. సనా(సెయింట్ జోసెఫ్ హైస్కూల్), పి.రమ్యశ్రీ(హుజూర్‌నగర్) మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. ఓవరాల్ చాంపియన్‌గా సెయింట్ జోసెఫ్ హైస్కూల్ 24 పాయింట్లతో ఉత్తమ ప్రతిభ కనబరిచింది.

ప్రజాస్వామిక తెలంగాణ పునర్నిర్మాణానికి ఉద్యమిద్దాం

మావోయిస్టు పార్టీ తెలంగాణ రాష్ట్ర కమిటీ

చర్ల: ప్రజాస్వామిక తెలంగాణ పునర్నిర్మాణానికి ఉద్యమిద్దామని, తెలంగాణలో ప్రజాస్వామిక వాతావరణాన్ని నెలకొల్పాలని మావోయిస్టు పార్టీ తెలంగాణ రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చింది. ఈ మేరకు పార్టీ పేరిట మండలంలోని కొత్తపల్లి, లింగాపురం, గొంపల్లి గ్రామాలతో పాటు అటవీ ప్రాంతంలోని ఉంజుపల్లి లోనూ కరపత్రాలు వెలిశాయి. రాష్ట్రంలో ఉపా కేసులను రద్దు చేయాలని, ఎన్ఐఏ దాడులను ఆపాలని, ఎన్‌కౌంటర్లు లేని తెలంగాణ సమాజం కావాలని పార్టీ రాష్ట్ర కమిటీ కరపత్రాలలో కోరింది. సీపీఐ (మావోయిస్టు) పార్టీపై అనుబంధ ప్రజాసంఘాలపై విధించిన నిషేధాన్ని ఎత్తివేయాలని, పౌర, ప్రజాస్వామిక హక్కులకు ప్రభుత్వం గ్యారంటీ ఇవ్వాలని పార్టీ డిమాండ్ చేసింది. అక్రమంగా అరెస్ట్ చేసి జైళ్లల్లో నిర్బంధించిన ఉద్యమకారులను బేషరతుగా విడుదల చేయాలని, గ్రామీణ ప్రాంతాల్లో భూస్వాముల దోపిడీ, అనచివేతలకు వ్యతిరేకంగా పోరాడాలని, వడ్డీ వ్యాపారంపై నియంత్రణ ఉంచాలని, కల్తీ విత్తనాలు, కాంట్రాక్టు వ్యవసాయాలకు వ్యతిరేకంగా పోరాడాలని, పంటలకు గిట్టుబాటు ధరలు చెల్లించాలని, రైతుబంధు పథకం 5 ఎకరాల లోపు భూమి ఉన్న రైతులకు వర్తింపజేస్తూ కౌలు రైతులకు కూడా ఈ పథకాన్ని అమలు చేయాలని పార్టీ డిమాండ్ చేసింది. అంతేకాక భూస్వాములకు అనుకూలంగా ఉన్న ధరణి పోర్టల్‌ను రద్దు చేయాలని, తెలంగాణలో భూసంస్కరణలు అమలు చేయాలని పార్టీ డిమాండ్ చేసింది. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరించడాన్ని వ్యతిరేకించాలని, అసంఘటిత కార్మికులు వలస కార్మికుల సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. కరపత్రాలు వెలసిన సమాచారం అందుకున్న పోలీసులు ఆయా గ్రామాలకు చేరుకొని వాటిన స్వాధీనం చేసుకున్నారు.

ఆర్టీసీ డ్రైవర్‌పై దాడి..

నలుగురిపై బాధితుడి ఫిర్యాదు



గాయపడిన శ్రీనివాస్‌ను ఆస్పత్రికి తరలిస్తున్న పోలీసులు

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెంలోని బంధువుల ఇంటికి వచ్చి తిరిగివెళ్తున్న ఓ ఆర్టీసీ డ్రైవర్‌పై నలుగురు వ్యక్తులు పోలీసుల సమక్షాన దాడి చేసి గాయపరిచిన సంఘటన నగరంలోని ట్రాఫిక్ పోలీసు స్టేషన్ ఎదుట ఆదివారం చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. సారపాకకు చెందిన ఆర్టీసీ డ్రైవర్ కళ్లోజి శ్రీనివాస్ కొత్తగూడెంలోని బంధువుల ఇంటికి భార్యతో కలిసి వచ్చాడు. అనంతరం తిరుగు ప్రయాణంలో సూపర్‌బజార్‌లోని ట్రాఫిక్ పోలీసు స్టేషన్ ఎదుట కాలినడకన శ్రీనివాస్ భార్యతో కలిసి రోడ్డు దాటుతుండగా.. ఎదురుగా వస్తున్న కారుకు నెమ్మదిగా వెళ్లాలని సైగ చేశాడు. దీంతో కారు నడుపుతున్న హనుమాన్ బస్తీకి శాంషీర్ కారును పక్కకు ఆపి, శ్రీనివాస్ దగ్గరకు వచ్చి వాగ్వాదానికి దిగాడు. ఈ క్రమంలో ఇరువురు మధ్య గొడవ తీవ్రస్థాయికి వెళ్లి దాడి చేసుకున్నారు. శాంషీర్‌తో పాటుగా అతని స్నేహితులు, బంధువులు కలిసి శ్రీనివాస్‌పై దాడి చేయగా పక్కనే ఉన్న ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ నుంచి కొందరు పోలీసులు, చుట్టుపక్కల వారు వచ్చి ఆపినా ఆగకుండా శ్రీనివాస్‌ను తీవ్రంగా గాయపరిచారు. అనంతరం శ్రీనివాస్‌ను కొత్తగూడెం ప్రభుత్వ ఆస్పత్రికి పోలీసులు తరలించి చికిత్సను అందించారు. కారును నెమ్మదిగా నడపాలని సైగ చేసినందుకు తనపై శాంషీర్‌తో పాటు మరో నలుగురు దాడి చేసి గాయపరిచారని శ్రీనివాస్, పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అయితే శాంషీర్ తనను కూడా కొట్టాడని శ్రీనివాస్‌పై ఫిర్యాదు చేశాడు. ఈ ఘటనపై పోలీసులు విచారణ జరిపిన అనంతరం కేసు నమోదు చేస్తామని వెల్లడించారు.

నగదు, బంగారం చోరీ..



ఇంట్లో చిందరవందరగా పడి ఉన్న సామగ్రి

ఖమ్మంఅర్బన్: ఇంటికి తాళం వేసి తన స్వగ్రామానికి వెళ్లి వచ్చిన ఓ వ్యక్తి ఇంట్లో ఆదివారం చోరీ జరిగింది. ఈ ఘటన ఆదివారం నగరంలోని బోనకల్ రోడ్డులో గల శ్రీరాంనగర్ 14వ లైన్ చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. శ్రీరాంనగర్‌కు చెందిన మరికంటి శ్రీనివాసరావు తన తండ్రి ఇటీవల చనిపోవడంతో వారి కుటుంబసమేతంగా ఇంటికి తాళం వేసి నేలకొండపల్లి మండలం బైరవునిపల్లికి వెళ్లారు. తిరిగి ఆదివారం ఇంటికి వచ్చి చూడగా.. తలుపు ధ్వంసం చేసి ఉండడాన్ని శ్రీనివాసరావు భార్య శ్రీదేవి గుర్తించి ఇంట్లోకి వెళ్లి చూసింది. దీంతో ఇంట్లోని రూ.లక్ష నగదు, రెండు తులాల బంగారం, రూ.30వేల విలువైన వెండి సామగ్రి చోరీ చేసినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు పోలీసులు సంఘటన స్థలాన్ని సందర్శించి వేలిముద్రలు సేకరించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్టీసీలో 'మహాలక్ష్మి'కి పెరుగుతున్న ఆదరణ



ఖమ్మం పాత బస్టాండ్‌లో మహిళలతో పెరిగిన రద్దీ



బస్సు ఎక్కే దగ్గర ఇలా..

ఖమ్మంమామిళ్లగూడెం: ఆర్టీసీలో మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ఉచిత బస్ ప్రయాణం కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తుంది. ఖమ్మం రీజియన్‌లోని ఖమ్మం, మధిర, సత్తుపల్లి, కొత్తగూడెం, మణుగూరు, భద్రాచలం, ఇల్లెందు డిపోల నుంచి గత మూడు రోజులుగా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణిస్తున్న మహిళల సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. మహిళలు, బాలికలు, ట్రాన్స్‌జెండర్లు ప్రయాణ సమయంలో ఆధార్ లేదా ఏదైన గుర్తింపు కార్డు (ఒరిజినల్ లేదా జిరాక్స్)ను ఫోన్ లేదా ప్రత్యక్షంగా చూపించినా ఆర్టీసీ పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ప్రయాణానికి అవకాశాన్ని ఆర్టీసీ అధికారులు కల్పించారు.

మూడు రోజులకు 2,98585ల మహిళల ప్రయాణం

ఖమ్మం రీజియన్‌లోని ఏడు డిపోలలో ఈ నెల 14 నుంచి 16వ తేదీ వరకు 2,98585ల మహిళల ప్రయాణం చేశారు. 14న 1,19796మంది, 15న 87,994 మంది, 16న 90,795మంది మహిళలు ప్రయాణం చేశారు. దీంతో కొత్త, పాత బస్టాండ్‌లలో జనాలతో రద్దీ నెలకొంది. ఇది రోజు రోజుకు పెరిగే అవకాశముందని ఆర్టీసీ అధికారులు చెబుతున్నారు.

క్లుప్తంగా...

శ్రీవారి ఆలయంలో సుప్రభాతం స్థానంలో తిరుప్పావై

తిరుమల: ధనుర్మాసం ప్రారంభం కావడంతో తిరుమల శ్రీవారి ఆలయంలో ఆదివారం ఉదయం సుప్రభాత సేవ స్థానంలో తిరుప్పావై నివేదించారు. జనవరి 14వ తేదీ వరకు ఈ తిరుప్పావై పారాయణం కొనసాగనున్నది. ఆదివారం తెల్లవారుజామున 12.34 గంటలకు ధనుర్మాస ఘడియలు ప్రారంభమయ్యాయి. తిరుమల పెద్దజీయర్ మఠంలో తిరుప్పావై పారాయణం ఆదివారం ప్రారంభమైంది. పెద్దజీయర్ స్వామి, చిన్నజీయర్ స్వామి పాల్గొని మంగళాశాసనాలు అందించారు. శ్రీవారి ఆలయ పరిచారక కేశవ లక్ష్మీనరసింహన్ తిరుప్పావై ప్రవచనం వినిపించారు. మొదటి రోజు రెండు పాశురాలను పారాయణం చేశారు. తిరుమల ఆస్థాన మండపంలో హైదరాబాద్‌కు చెందిన వేదాంత విద్వాంసులు గోవర్ధనం స్వామినాథాచార్యులు ఉదయం 8 నుంచి 9 గంటల వరకు తిరుప్పావై ప్రవచనాలు వినిపించారు. ఈ కార్యక్రమాల్లో టీటీడీ ఈవో ఏవీ ధర్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇక రూ.25లక్షల వరకు 'ఆరోగ్యశ్రీ'

నేడు లాంఛనంగా ప్రారంభించనున్న సీఎం జగన్


సాక్షి, అమరావతి: ఏపీలో పేద, మధ్యతరగతి ప్రజలకు మెరుగైన ఉచిత కార్పొరేట్ వైద్యం అందించే విషయంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరో గొప్ప మైలురాయికి శ్రీకారం చుడుతున్నారు. డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీకి మరిన్ని మెరుగులు దిద్దుతూ దానిని మరింత బలోపేతం చేసే కార్యక్రమాన్ని ఆయన సోమవారం లాంఛనంగా ప్రారంభించనున్నారు. ఈ పథకం కింద ఇక నుంచి రూ.25 లక్షల వరకు ఉచిత వైద్యం అందించే కార్యక్రమంతోపాటు సరికొత్త ఫీచర్లతో ఆరోగ్యశ్రీ స్మార్ట్‌కార్డుల జారీని కూడా ఆయన తన క్యాంపు కార్యాలయం నుంచి ప్రారంభిస్తారు. అలాగే, లబ్ధిదారులకు దిక్సూచిలా పనిచేసే ఆరోగ్యశ్రీ యాప్‌ను ప్రతి ఒక్కరి సెల్‌ఫోన్‌లో డౌన్‌లోడ్ చేయించడం.. దాని ద్వారా ఉచితంగా వైద్యం ఎలా చేయించుకోవాలి, ఎక్కడికి వెళ్లాలి, ఆరోగ్యశ్రీ సేవలు ఎలా పొందాలి, ఎవరిని అడగాలనే సందేహాలన్నింటినీ ప్రతిఇంట్లో నివృత్తిచేసే కార్యక్రమాన్ని కూడా ముఖ్యమంత్రి ప్రారంభిస్తారు. ఇక కొత్త కార్డుల పంపిణీ సందర్భంగా ప్రతీ ఇంట్లో కనీసం ఒకరి ఫోన్‌లో ఆరోగ్యశ్రీ యాప్ డౌన్‌లోడ్ చేసుకునేలా ఏఎన్ఎంలు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు, ఆశా వర్కర్లు, వలంటీర్లు, మహిళా పోలీసులు, ఎమ్మెల్యేలు ఇతర ప్రజా ప్రతినిధులు స్వయంగా చూస్తారు.

ఓట్ల.. కేటుగాళ్లు

ఉనికి కోసం టీడీపీ సానుభూతిపరులతో బాబు బోగస్ వేషాలు

తెలంగాణలో నివాసం, ఓటు.. ఏపీలోనూ ఓటర్లుగా నమోదు

- పోలింగ్ ముగిసిన మర్నాడే హైదరాబాద్‌లో టీడీపీ నేతల మేళా
- సానుభూతిపరులతో శిబిరాలు.. ఆన్‌లైన్‌లో పెద్ద ఎత్తున ఫామ్ 6 దరఖాస్తులు
- ఏపీలోనూ ఓటర్లుగా నమోదు చేయాలంటూ లక్షల సంఖ్యలో అప్లికేషన్లు
- ఒకే వ్యక్తి ఒకటి కంటే ఎక్కువ ఓట్లు కలిగి ఉండటం చట్ట ప్రకారం నేరం
- ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించి.. అక్రమాలకు పాల్పడుతున్న టీడీపీ
- బాబు చూపిన బాటలోనే నడుస్తున్న జనసేన
- పవన్ సోదరుడు నాగేంద్రరావు, కుటుంబ సభ్యులకు హైదరాబాద్‌లో ఓట్లు
- తామంతా వడ్డేశ్వరంలో నివాసం ఉంటున్నామంటూ మళ్లీ ఓటు కోసం దరఖాస్తు
- హైదరాబాద్‌లో ఓట్లున్న 4.30 లక్షల మందికి ఏపీలోనూ ఓట్లు..



వాట్సాప్‌లో టీడీపీ పంపించిన సందేశం

సాక్షి, అమరావతి: వచ్చే ఎన్నికల్లోనూ 2019కి మించి ఘోర పరాజయం తప్పదని నిర్ధారణకు వచ్చిన టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు ఓటమికి ఇప్పట్నుంచే సాకులు వెతుక్కుంటున్నారు. ఒకవైపు ఓటర్ల జాబితాలో అక్రమాలు జరిగాయంటూ ఎల్లో మీడియాతో కలిసి గగ్గోలు పెడుతున్న ఆయన మరోవైపు నిబంధనలను కాలరాస్తూ, ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తూ యథేచ్ఛగా దొంగ ఓట్లను చేర్పిస్తున్నారు. ప్రజాప్రాతినిధ్య చట్టం 1950 సెక్షన్ 17, 18 ప్రకారం దేశంలో ఒక నియోజకవర్గంలో ఒక వ్యక్తికి ఒక ఓటు మాత్రమే ఉండాలి. వేర్వేరు రాష్ట్రాల్లో వేర్వేరు నియోజకవర్గాల్లో ఓటు నమోదు చేయించుకోవడం చట్ట ప్రకారం నేరం. రాజకీయాల్లో 1978 నుంచి ఉన్న చంద్రబాబుకు ఇది తెలిసినా తెలంగాణలో ప్రధానంగా హైదరాబాద్‌లో నివాసం ఉంటూ అక్కడ ఓటర్లుగా ఉన్న టీడీపీ సానుభూతిపరులను ఏపీలోనూ ఓటర్లుగా నమోదు చేయిస్తున్నారు. తెలంగాణలోనూ, ఏపీలోనూ రెండు చోట్లా ఓట్లు ఉన్న వారు (డూప్లికేట్లు) 4,30,264 మంది ఉన్నారు. కర్ణాటక, తమిళనాడు, ఒడిశాలో నివాసం ఉంటూ అక్కడ ఓటర్లుగా ఉన్న లక్షల మంది టీడీపీ సానుభూతిపరుల పేర్లను ఏపీలోనూ సరిహద్దు నియోజకవర్గాల్లో చేర్పించారు. వాటిని తొలగించి ప్రజాస్వామ్య స్ఫూర్తిని పరిరక్షించాలని ప్రజాసంఘాలు, మేధావులు, రాజకీయ పరిశీలకులు డిమాండ్ చేస్తున్నారు.

తెలంగాణలో పోలింగ్ ముగిసిన మర్నాడే..

తెలంగాణ శాసనసభ ఎన్నికల పోలింగ్ నవంబర్ 30న పూర్తయింది. ఆ మరుసటి రోజే అంటే డిసెంబర్ 1 నుంచే హైదరాబాద్‌లో ఓటర్లుగా ఉన్న టీడీపీ సానుభూతిపరులను ఏపీలోనూ ఓటర్లుగా చేర్పించేందుకు ఆ పార్టీ భారీ ఎత్తున శిబిరాలు నిర్వహించింది. కూకట్‌పల్లి, నిజాంపేట, వనస్థలిపురం, మణికొండ, భరత్‌నగర్ తదితర ప్రాంతాల్లో శిబిరాల ఇన్‌ఛార్జ్‌లను నియమించిన టీడీపీ ఉదయం 8 నుంచి 12 గంటల వరకూ ఓటర్లుగా చేర్పించే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పార్టీ సానుభూతిపరులకు ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చింది. వయసు, చిరునామా ధ్రువీకరించే ఆధార్ కార్డును వాట్సాప్‌లో పంపితే తామే ఆన్‌లైన్‌లో ఓటరుగా నమోదు చేయిస్తామని, ఎన్నికల సంఘానికి తామే ఫారం 6 సమర్పిస్తామంటూ సందేశాలు పంపింది. టీడీపీని భుజానికెత్తుకునే మోసే ఓ సామాజిక వర్గం నాయకులు ఈ ప్రచారంలో ప్రధాన భూమిక పోషించారు. ఇలా హైదరాబాద్, తెలంగాణలో నివాసం ఉంటున్న లక్షల మంది టీడీపీ సానుభూతిపరులను ఏపీలోని పలు నియోజకవర్గాల్లో ఓటర్లుగా చేర్చేందుకు ఫారం 6 దరఖాస్తులను ఆన్‌లైన్‌లో ఇప్పటికే సమర్పించారు. ఈ ప్రక్రియను ఇప్పటికీ కొనసాగిస్తున్నారు.

> ప్రజాస్వామ్యమంటే... ప్రజల చేత.. ప్రజల కోసం.. ప్రజలే ప్రభుత్వాన్ని ఎన్నుకోవడం. ప్రజలే ప్రభువులు!
> ప్రజాస్వామ్య ప్రక్రియలో ప్రతి ఓటూ కీలకమే. ఒకే ఒక్క ఓటు గెలుపోటములను నిర్దేశిస్తుంది. కేవలం ఒకే ఒక్క ఓటు అభ్యర్థుల తలరాతలను మార్చేస్తుంది.
> ఓటర్ల జాబితా ఎంత పారదర్శకంగా ఉంటే ప్రజాతీర్పు అంత స్పష్టంగా ఉంటుంది. అప్పుడే ప్రజాస్వామ్యం పరిఢవిల్లుతుంది.
> ప్రజల ఆశీస్సులతో కాకుండా.. అడ్డదారుల్లో అధికారం కోసం అర్రులు చాచే వ్యక్తిని ఏమంటారు? కేటుగాడనే కదా!
> ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచి దొంగదారిలో అధికారాన్ని దక్కించుకున్న చంద్రబాబు నాటి నుంచి ఓటర్ల జాబితాలో అక్రమాలకు పాల్పడుతూ 'డూప్లికేటు' వేషాలు వేస్తున్నారు!

పవన్ కుటుంబం బరి తెగింపు..

ఆవు చేలో మేస్తే దూడ గట్టున మేస్తుందా? అనే తరహాలో డూప్లికేటు ఓట్లు చేర్చడంలో జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ కూడా అదే బాట పట్టారు. ఆయన సోదరుడు కొణిదల నాగేంద్రరావుకు హైదరాబాద్‌లోని ఖైరతాబాద్ నియోజకవర్గంలో పోలింగ్ బూత్ నెంబరు 168లో సీరియల్ నెంబరు 323 ఎఫ్‌వైవై 6038202 ఓటరు కార్డు నెంబరుతో ఓటు ఉంది. నాగేంద్రరావు సతీమణి పద్మజ కొణిదలకు సీరియల్ నెంబరు 324, వారి కుమారుడు కొణిదెల సాయివరుణ్ తేజ్‌కు సీరియల్ నెంబరు 325తో అక్కడ ఓట్లున్నాయి. తెలంగాణ శాసనసభ ఎన్నికల ఫలితాలు వెలువడిన మరుసటి రోజే అంటే డిసెంబరు 4న ఏపీలోనూ ఓటు హక్కు కోసం వారు దరఖాస్తు చేసుకున్నారు. మంగళగిరి నియోజకవర్గం తాడేపల్లి మండలం వడ్డేశ్వరంలోని రాధారంగా నగర్ మూడో వీధి 5–263 డోర్ నెంబర్ ఇంటిలో తాము నివాసం ఉంటున్నామంటూ కొణిదల నాగేంద్రరావు, పద్మజ, సాయివరుణ్ తేజ్ ఓటర్లుగా నమోదు కోసం ఫారం 6 దరఖాస్తు సమర్పించడం గమనార్హం. చంద్రబాబు రాజకీయ ప్రయోజనాల కోసమే జనసేనను స్థాపించిన సినీనటుడు పవన్ కళ్యాణ్ తాజాగా మరోసారి జత కట్టడం ద్వారా దీన్ని రుజువు చేసుకున్నారని రాజకీయ విశ్లేషకులు, మేధావులు, ప్రజాసంఘాలు స్పష్టం చేస్తున్నాయి. 2014 ఎన్నికల్లో పోటీ చేయకుండా చంద్రబాబుకు బేషరతుగా మద్దతు తెలిపిన పవన్ కళ్యాణ్ 2019 ఎన్నికల్లో ప్రభుత్వ వ్యతిరేక ఓటును చీల్చడం ద్వారా టీడీపీకి మేలు చేసేందుకు శక్తి వంచన లేకుండా ప్రయత్నించారు.

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

పవన్ ఇంటికి చంద్రబాబు

- లోక్‌సభ ఎన్నికల్లో జనసేనతో పొత్తు ఉండదన్న బీజేపీ నేత కిషన్‌రెడ్డి
- టీడీపీ, జనసేన, బీజేపీ పొత్తు ఉంటుందని పలుమార్లు చెప్పిన పవన్
- కిషన్‌రెడ్డి ప్రకటనతో గందరగోళంలో ఇరు పార్టీలు
- దీంతో పవన్ వద్దకు వెళ్లి చర్చలు జరిపిన చంద్రబాబు



సాక్షి, అమరావతి: టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ఆదివారం రాత్రి హైదరాబాద్‌లో జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ఇంటికి వెళ్లారు. పవన్‌తో సమావేశమై పలు అంశాలపై చర్చించారు. ఇటీవలి తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ – జనసేన ఉమ్మడిగా పోటీ చేసిన విషయం తెలిసిందే. త్వరలో జరిగే లోక్‌సభ ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ ఒంటరిగానే పోటీ చేస్తుందని ఆ పార్టీ తెలంగాణ అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి రెండు రోజుల క్రితం ప్రకటన చేశారు. ఈ నేపథ్యంలో ఆదివారం రాత్రి పవన్ ఇంటికి చంద్రబాబు వెళ్లడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఏపీలో టీడీపీ, జనసేన పొత్తుకు బీజేపీ కూడా కలిసి వస్తుందని పవన్ గతంలో పలుమార్లు ఆశాభావం వ్యక్తం చేశారు. ఇప్పుడు కిషన్‌రెడ్డి ప్రకటనతో గందరగోళం ఏర్పడింది. దీనిపైనా పవన్, చంద్రబాబు మధ్య ప్రధానంగా చర్చ జరిగినట్లు సమాచారం. బీజేపీ స్పష్టమైన నిర్ణయం తీసుకున్నాకే కిషన్‌రెడ్డి ఆ వ్యాఖ్యలు చేసి ఉంటారా అన్న దానిపై ఇరువురు నేతలు చర్చించుకొని ఉండొచ్చని పార్టీ వర్గాలు తెలిపాయి. మరోపక్క.. ఈ నెల 20న విజయనగరం జిల్లాలో లోకేశ్ యువగళం యాత్ర ముగింపు కార్యక్రమం జరగనుంది. దీనికి పవన్ రావడంలేదని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు శనివారం ప్రకటన చేశారు. ఆ కార్యక్రమానికి పవన్ కూడా హాజరైతే టీడీపీకి మేలు జరుగుతుందని లోకేశ్ భావిస్తున్నారు. లోకేశ్ ఒత్తిడితో ముగింపు కార్యక్రమానికి పవన్‌ను ఆహ్వానించేందుకే చంద్రబాబు స్వయంగా పవన్ ఇంటికి వెళ్లినట్లు జనసేన వర్గాలు చెబుతున్నాయి. టీడీపీ వర్గాల కథనం మరోలా ఉంది. ఇరు పార్టీల సీట్ల సర్దుబాటు, రాష్ట్రమంతటా చంద్రబాబు– పవన్ ఉమ్మడిగా సభల ఏర్పాటుకు సంబంధించి ఇరువురు నేతలు చర్చించుకున్నారని టీడీపీ వర్గాలు చెబుతున్నాయి.

అధికార వైఎస్సార్‌సీపీ ముందే రాజకీయం వేడెక్కించడంతో..

2024 ఎన్నికలకు మరికొద్ది నెలలే సమయం ఉండటంతో వైఎస్సార్‌సీపీని సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ముందుండి నడిపిస్తున్నారు. పార్టీలో అంతర్గత మార్పులకు శ్రీకారం చుట్టారు. కొన్ని ప్రత్యేక నియోజకవర్గాల్లో కొత్తగా పార్టీ ఇన్‌చార్జిలను నియమిస్తున్నారు. దీంతో రాష్ట్రంలో ఎన్నికల వాతావరణాన్ని ఒక్కసారిగా వేడెక్కింది. మరోపక్క ప్రధాన ప్రతిపక్షమైన టీడీపీ, చంద్రబాబు దత్తపుత్రుడు పవన్ నేతృత్వంలోని జనసేన అభ్యర్థులని వెదుక్కోవాల్సిన పరిస్థితి. ఆ రెండు పార్టీ మధ్య సీట్ల సర్దుబాటు తొందరగా తేల్చాల్సిన పరిస్థితిని వైఎస్సార్‌సీపీ వారి ముందుంచింది. ఈ నేపథ్యంలోనే చంద్రబాబు, పవన్ తాజా భేటీ జరిగి ఉంటుందని ఆ పార్టీల నేతలు భావిస్తున్నారు.

తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లిలో జరిగిన సామాజిక సాధికార యాత్ర సభకు హాజరైన భారీ జనసందోహంలో ఓ భాగం



జనం.. జైత్రయాత్ర

కర్నూలు, తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లి, ఎన్టీఆర్ జిల్లా నందిగామలో సామాజిక సాధికార యాత్రకు బ్రహ్మరథం పట్టిన ప్రజలు

జిల్లా వార్తలు

కవి సమ్మేళనంలో ప్రథమ స్థానం



ప్రభాకర్‌రావును సత్కరిస్తున్న నిర్వాహకులు

తిరుమలాయపాలెం: కలాం విజన్, యువతేజం ట్రస్ట్ ఆధ్వర్యంలో హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆదివారం వివిధ అంశాలపై నిర్వహించిన కవి సమ్మేళనంలో దక్షిణ భారత దేశం నుంచి 100 మందికి పైగా కవులు, కవయిత్రులు హాజరయ్యారు. వీరిలో తిరుమలాయపాలెం మండలం పాతర్లపాడుకు చెందిన కవి కేశరాజు వెంకట ప్రభాకర్‌రావు ప్రథమ స్థానంలో నిలిచారు. ఆ తర్వాత తెలుగు భాష చైతన్య సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లోనూ ప్రభాకర్ రావు ప్రథమ బహుమతి సాధించారు.

ఉమ్మడి జిల్లా చెస్ జట్లు సిద్ధం

ఖమ్మం స్పోర్ట్స్ : ఉమ్మడి జిల్లా స్థాయి పాఠశాలల అండర్‌– 14, 17 బాలబాలికల చెస్ ఎంపికలు నగరంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో ఆదివారం నిర్వహించారు. ఈ ఎంపికలకు ఉమ్మడి జిల్లా నలుమూలల నుంచి 75 మంది క్రీడాకారులు హాజరయ్యారు. ఈ ఎంపికల్లో ప్రతిభ చూపిన క్రీడాకారులు ఈనెల 18 నుంచి మంచిర్యాల జిల్లా బెల్లంపల్లిలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారు.

ఎంపికైన క్రీడాకారులు వీరే..

అండర్ 14, 17 బాలుర జట్టులో ఎస్‌కే మహమ్మద్, వి.సాయివిఘ్నేష్, ఎస్‌వీఎల్ఎస్ మణికంఠ, ఎస్‌కే అఫ్రీది, కె సంకీర్త, ఎ. శ్రీవివేక్ సీహెచ్. నాగ వెంకటదుర్గా ప్రణవ్, కె.రఘురాం, జె.విజయ్, కిరణ్, సందేశ్ ఉన్నారు. బాలికల జట్టులో బి.దివ్య, బి.పల్లవి, పి.సుధాశ్రీ, జి.హర్షిత, జె.శ్రీకళ, ఎం.వర్షిత, జి.లక్ష్మీసహస్ర, కె.అహనా ఎంపికయ్యారు. ఈ ఎంపికల్లో జిల్లా క్రీడల కార్యదర్శి కె.నరసింహమూర్తి, చెస్ జిల్లా కోచ్, ఇంటర్నేషనల్ క్రీడాకారుడు సీహెచ్.గోపి తదితరులు పాల్గొన్నారు.

గ్రాట్యుటీ.. ఏమిటీ పరిస్థితి?!

ఏళ్లుగా ఎదురుచూస్తున్న సింగరేణి కార్మికులు

- చెల్లించకుండా ఇబ్బంది పెడుతున్న యాజమాన్యం
- సంస్థ పరిధిలో వందలాది మందికి ఇక్కట్లు
- 30 రోజుల్లోగా ఇవ్వాలనే నిబంధన ఉన్నా అభ్యంతరాలు



సింగరేణి ప్రధాన కార్యాలయ ముఖద్వారం

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థలో సుదీర్ఘ కాలం విధులు నిర్వర్తించి, ఉద్యోగ విరమణ అనంతరం కార్మికులకు చెల్లించాల్సిన గ్రాట్యుటీ విషయంలో యాజమాన్యం ఇబ్బంది పెడుతుందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పదవీ విరమణ చేసిన కార్మికులకు ఎలాంటి షరతులు లేకుండా నెలలోగా గ్రాట్యుటీ చెల్లించాలని చట్టం చెబుతోంది. కానీ సంస్థలో మాత్రం కొర్రీలు పెట్టి గత నాలుగైదేళ్లుగా గ్రాట్యుటీ చెల్లించకపోవడంతో వందలాది మంది కార్మికులకు ఎదురుచూపులు తప్పడం లేదు.

ఎందుకు ఆంక్షలు?

కార్మికులకు సంస్థ ఇళ్లు కేటాయిస్తుండగా 30, 40 ఏళ్ల పాటు అందులోనే నివసిస్తారు. అయితే, సంస్థ కట్టించిన గదులు చిన్నగా ఉండడంతో కుటుంబ అవసరాల నరిపోక క్వార్టర్ పక్కన రెండు, మూడు అదనపు గదులు నిర్మించుకోవడం అంతటా జరుగుతోంది. కాగా, ఉద్యోగ విరమణ చేశాక క్వార్టర్‌ను సంస్థ తిరిగి అప్పగిస్తే గ్రాట్యుటీ చెల్లించాలి. ఇంత వరకు బాగానే ఉన్నా అదనంగా చేపట్టిన నిర్మాణాలను తొలగించి ఆ స్థలాన్ని కూడా అప్పగించాల్సిందేనని యాజమాన్యం పట్టుబడుతోంది. ఏళ్ల తరబడి నివాసముంటూ ఈ ప్రాంతంతో అనుబంధం ఏర్పర్చుకున్న కార్మికులు ఇందుకు సుముఖత చూపడం లేదు. కాగా, విధులు నిర్వర్తించినప్పుడు క్వార్టర్ పేరుతో సంస్థ తమకు ఇవ్వాల్సిన ఇంటి అద్దెను మినహాయించుకుందని, అయినా సకాలంలో గ్రాట్యుటీ చెల్లించకపోవడం సరికాదని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అద్దె సరే.. వడ్డీ ఏది?

సంస్థ ఉద్యోగి పదవీ విరమణ అనంతరం ఆరు మాసాల వరకు క్వార్టర్‌లో ఉండే అవకాశం కల్పించింది. అయితే ఆరు మాసాల తర్వాత కార్మికుడు క్వార్టర్ ఖాళీ చేయకపోతే నెలకు రూ.5వేల అద్దె వసూలు చేస్తున్నారు. కానీ ఏళ్ల తరబడి కార్మికుల కష్టార్జితమైన గ్రాట్యుటీ రూ.20 లక్షలపై వడ్డీ ఎందుకు చెల్లించడం లేదని కార్మికులు నిలదీస్తున్నారు.

ఐదేళ్లు పనిచేస్తే గ్రాట్యుటీ

అన్ని సంస్థల్లో పర్మినెంట్ ఉద్యోగుల సామాజిక భద్రత కోసం పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తారు. ఇందులో భాగంగా సీఎంపీఎఫ్ (ఈపీఎఫ్)తో పాటు గ్రాట్యుటీ ప్రత్యేక సంక్షేమ పథకంగా 1972లో చట్టం అమల్లోకి వచ్చింది. ఏదైనా ప్రభుత్వ రంగ సంస్థలో పర్మనెంట్ ఉద్యోగిగా విధులు నిర్వర్తిస్తూ నిరంతరాయంగా ఐదేళ్లు కొనసాగితే గ్రాట్యుటీకి అర్హులవుతారు. అయితే గని కార్మికులకు గతంలో ఈ గ్రాట్యుటీ రూ.10 లక్షలు ఉండగా, 2017లో జేబీసీసీఐ చర్చల్లో పలు కార్మిక సంఘాల పోరాట ఫలితంగా రూ.20 లక్షలకు పెంచారు. కాగా, ఉద్యోగ విరమణ రోజే అన్ని చెల్లింపులు పూర్తిచేసి, నెలలోగా గ్రాట్యుటీ ఇవ్వాలనే నిబంధన ఉంది. కానీ ఏళ్లుగా గ్రాట్యుటీ చెల్లింపులో జాప్యం జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ఈ విషయంలో కొందరు ఆర్ఎల్సీని ఆశ్రయించగా, మరికొందరు కూడా అదే బాట పట్టనున్నట్లు సమాచారం.

ఏళ్లుగా నలుగుతున్న క్వార్టర్ల అంశం

సింగరేణి సంస్థలో చాలా కాలంగా క్వార్టర్ల అంశం నలుగుతోంది. సంస్థలో పనిచేసి రిటైర్ అయిన వారికి అదే క్వార్టర్‌ను ప్రభుత్వ ధర ఆధారంగా సొంతం చేయాలని కార్మికులు కొంతకాలంగా కోరుతున్నారు. ఈ విషయాన్ని కార్మిక సంఘాలు, ప్రజాసంఘాల నాయకులు ఎన్నికల సమయాన చర్చకు వస్తున్నా ఆ తర్వాత మరుగున పడిపోతోంది. సింగరేణి వ్యాప్తంగా 11 ఏరియాల్లో ఈ సమస్య ఉండగా... కొన్ని ఏరియాల్లో క్వార్టర్ల మధ్య కార్మికులు కట్టుకున్న గృహాలకు ఇంటి నంబర్లు కూడా ఇచ్చారు. తెలంగాణ ఏర్పడ్డాక సింగరేణి సంస్థ రాష్ట్ర ప్రభుత్వ అవసరాలకు వేలాది ఎకరాల స్థలం, వందల సంఖ్యలో క్వార్టర్లను కేటాయించింది. కానీ సంస్థ అభివృద్ధి కోసం అహర్నిశలు పాటుపడుతున్న తమ విషయంలో నిర్లక్ష్యం చేయడం సరికాదని కార్మికులు వాపోతున్నారు.

త్వరలోనే నిర్ణయం



కార్మికులకు గ్రాట్యుటీ చెల్లింపుల్లో జాప్యంపై ఇటీవల సమీక్షించాం. కార్పొరేట్ కార్యాలయంలో వెల్ఫేర్ విభాగం వారితో జరిగిన సమావేశంలో వివరాలు తెలుసుకున్నాం. త్వరలో సరైన నిర్ణయం తీసుకొని కార్మికులకు న్యాయం చేస్తాం.

– ఎస్.బలరామ్, సింగరేణి డైరెక్టర్(పా)

విద్యారంగ పరిరక్షణకు ఉద్యమం

- జనవరి 12న 'చలో పార్లమెంట్' నిర్వహిస్తాం
- ఎస్ఎఫ్ఐ అఖిల భారత అధ్యక్షుడు వీపీ సాను



సమావేశంలో మాట్లాడుతున్న వీపీ సాను

ఖమ్మంమయూరిసెంటర్ : దేశంలో విద్యారంగ పరిరక్షణ కోసం ఉద్యమాలు చేపడతామని భారత విద్యార్థి సమాఖ్య (ఎస్ఎఫ్ఐ) అఖిల భారత అధ్యక్షుడు వీపీ సాను అన్నారు. నూతన జాతీయ విద్యా విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ జనవరి 12న చలో పార్లమెంట్ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. ఖమ్మంలోని సుందరయ్య భవనంలో ఆదివారం జరిగిన ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సమావేశాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తోందని విమర్శించారు. పాఠ్య పుస్తకాల్లో మతోన్మాద భావజాలాన్ని జొప్పిస్తూ విద్యారంగాన్ని కాషాయీకరిస్తోందని ఆరోపించారు. జాతీయ ఉద్యమ నాయకుల చరిత్రను తొలగించి, జాతీయోద్యమంతో సంబంధం లేని హెగ్డేవార్, సావర్కర్ చరిత్రను పొందుపరుస్తున్నారని అన్నారు. ఈ చర్యలను వ్యతిరేకిస్తూ దేశ వ్యాప్తంగా ఉన్న 16 విద్యార్థి సంఘాలతో కలిసి ఆందోళన చేస్తామని ప్రకటించారు. కేంద్ర విశ్వ విద్యాలయాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కనీస నిధులు కేటాయించడం లేదని, ప్రభుత్వ యూనివర్సిటీలను నీరుగార్చేందుకు కుట్ర పన్నుతున్నారని, నూతన జాతీయ విద్యా విధానంలో భాగంగా బడా, బహుళ జాతి కంపెనీల ప్రైవేటు యూనివర్సిటీలను ఆహ్వానిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి తాళ్ల నాగరాజు మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యార్థులకు రావాల్సిన ఉపకార వేతనాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.7,800 కోట్లు ఉన్నాయని, ఈ బకాయిలతో పాటు సంక్షేమ హాస్టళ్లకు డైట్ బిల్లులు సకాలంలో ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్రంలో ప్రభుత్వ యూనివర్సిటీలకు సరిపడా నిధులు కేటాయించాలని, ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు.

ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎల్ మూర్తి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఖమ్మం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సుధాకర్, తుడుం ప్రవీణ్, కేంద్ర కమిటీ సభ్యురాలు మమత, రాష్ట్ర ఉపాధ్యక్షులు దామెర కిరణ్, శ్రీకాంత్ వర్మ, సంతోష్, శంకర్, రాష్ట్ర సహాయ కార్యదర్శులు వనం రాజు, బుర్ర వీరభద్రం, దాసరి ప్రశాంత్, అశోక్ రెడ్డి, ప్రశాంత్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

నవోదయలో అ'పూర్వ' సమ్మేళనం



ప్రిన్సిపాల్‌ను సత్కరిస్తున్న పూర్వ విద్యార్థులు

కూసుమంచి : పాలేరు జవహర్ నవోదయ విద్యాలయలో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రతీ సంవత్సరం డిసెంబర్‌లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. భారీ సంఖ్యలో హాజరైన విద్యార్థులు పాత జ్ఞాపకాలు నెమరువేసుకుంటూ ఆనందంగా గడిపారు. అనంతరం విద్యాలయ ప్రిన్సిపాల్ ఆర్. శ్రీనివాసులు జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు కీమా నాయక్, బాద్యులు కోక్యానాయక్ తదితరులు మాట్లాడుతూ.. తాము ఈ విద్యాలయలో చదువుకుని ఉన్నత స్థానాలకు చేరుకున్నామని, విద్యాలయ, ఉపాధ్యాయుల రుణం తీర్చుకోలేనిదని అన్నారు. క్రమశిక్షణ, ఉత్తమ విద్యకు నవోదయ మారుపేరన్నారు. విద్యాలయ సర్వతోముఖాభివృద్ధికి తాము ఎల్లవేళలా పాటుపడతామని చెప్పారు. ప్రిన్సిపాల్ శ్రీనివాసులు మాట్లాడుతూ.. నవోదయ విద్యాలయాల్లో చదివిన ప్రతి విద్యార్థి సమాజానికి ఉపయోగపడేలా తీర్చిదిద్దబడుతున్నారని అన్నారు. ఎందరో విద్యార్థులు ఇక్కడ చదివి ఉన్నతులుగా ఎదిగారని గుర్తు చేశారు. ప్రస్తుత విద్యార్థులు కూడా గర్వించదగ్గ స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. విద్యాలయంలో ఇటీవల విద్యుత్‌షాక్‌తో మృతిచెందిన విద్యార్థి హలావత్ దుర్గా నాగేందర్ కుటుంబానికి పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు కొంత మొత్తాన్ని విరాళంగా అందజేశారు. అనంతరం ప్రిన్సిపాల్‌ను ఘనంగా సత్కరించారు.



హంస వాహనాన్ని తయారుచేస్తున్న కళాకారులు

ముమ్మరంగా 'ముక్కోటి' పనులు

సిద్ధమవుతున్న హంస వాహనం

భద్రాచలంటౌన్: భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయంలో ఈనెల 22, 23 తేదీల్లో జరిగే తెప్పోత్సవం, ఉత్తర ద్వార దర్శనం వేడుకలకు ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. తెప్పోత్సవానికి హంస వాహనాన్ని సిద్ధం చేస్తున్నారు. ఏపీలోని ఏలూరుకు చెందిన 22 మంది కళాకారులు ఓ లాంచీపై హంస ఆకృతిని తీర్చిదిద్దే పనుల్లో నిమగ్నమయ్యారు. దీంతో పాటు శ్రీ సీతారామచంద్రస్వామి వారు గౌతమీ నదిలోని హంస వాహనం ఎక్కేందుకు నది ఒడ్డు నుంచి కర్రలతో ర్యాంపు తయారు చేస్తున్నారు. ఈ ఏడాది ముక్కోటి ఏకాదశి రోజున సుమారు రెండు లక్షల మంది భక్తులు హాజరయ్యే అవకాశం ఉందనే అంచనాతో అధికారులు లడ్డూ ప్రసాదాలు అందుబాటులో ఉంచుతున్నారు. ప్రసాదాన్ని భక్తులకు అందించేందుకు వీలుగా పట్టణంలో పలు చోట్ల ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేస్తున్నారు. ముక్కోటికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడాలని కలెక్టర్ ప్రియాంక ఆల అధికారులను నిత్యం అప్రమత్తం చేస్తున్నారు.